క్లుప్తంగా

రెండో పట్టణ సీఐగా ఉమామహేశ్వరరావు


ఉమామహేశ్వరరావు

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా గుండుమోను ఉమామహేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన స్వగ్రామం విజయనగరం కాగా 2004 బ్యాచ్‌కు చెందిన వారు. ఎస్సైగా విశాఖపట్నం రూరల్, పాయకరావుపేట, కొత్తకోట, పెదబయలు, బోడిబందల్లో పని చేశారు. 2019లో సీఐగా ఉద్యోగోన్నతి పొందారు. అనకాపల్లి, పరవాడ లాఅండ్ ఆర్డర్, విశాఖపట్నం సౌత్ ట్రాఫిక్‌ల్లో సీఐగా పని చేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. సిబ్బంది, ప్రజల సహకారంతో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూస్తామన్నారు.

వలంటీర్లకు నియామక పత్రాల అందజేత


గ్రామ వలంటీర్లతో సాయికుమార్

రణస్థలం: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు పారదర్శకంగా గ్రామ వలంటీర్లు చేరవేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో కొండములగాం, సంచాం, పాతర్లపల్లి, రావాడ గ్రామాలకు చెందిన గ్రామ వలంటీర్లకు శుక్రవారం నియామక పత్రాలు అందజేశారు. ఎంపీడీఓ ఆర్.వి. రమణమూర్తి, వైస్ ఎంపీపీలు రాయపురెడ్డి భుజంగరావు, మైలపల్లి లక్ష్మీకామరాజు, పార్టీ మండల అధ్యక్షుడు మహంతి పెదరామినాయుడు, ఎఫ్ఎస్‌సీఎస్ అధ్యక్షుడు కిల్లారి రమణ, సర్పంచ్ గొర్లె అప్పలనాయుడు, లంక పాపారావు తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ సంఘం ఏర్పాటు


ఏబీవీపీ సంఘం సభ్యులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఏబీవీపీ సంఘాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా వెంకటేష్, కార్యదర్శిగా సంతోష్, సంఘం సభ్యులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఏబీవీపీ కన్వీనర్ కిరణ్ హాజరయ్యారు. విశ్వవిద్యాలయాల ప్రగతికి తమ వంతు కృషి చేయటంతోపాటు, విద్యార్థుల సమస్యలు పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. అన్ని వర్సిటీల్లో సంఘాలు బలోపేతం చేయనున్నట్లు చెప్పారు.

మంత్రి ధర్మానను కలిసిన ఎంపీడీవో సతీష్


మంత్రి ధర్మానకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీడీవో సతీష్

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం ఎంపీడీవోగా నియమితులైన మరడాన సతీష్ మంత్రి ధర్మాన ప్రసాదరావును పెదపాడులోని క్యాంప్ కార్యాలయంలో వుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మంత్రి ధర్మాన ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

టెక్కలి రూరల్: వాహనదారులు, వ్యాపారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని టెక్కలి సీఐ పి.ఫైడయ్య అన్నారు. ఇటీవ బదిలీపై టెక్కలి వచ్చిన ఆయన శుక్రవారం ట్రాఫిక్ రూల్స్‌పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ జంక్షన్ నుంచి ఇందిరాగాంధీ జంక్షన్ వరకు నడుచుకొని వెళ్లి రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్ వ్యాపారులతో మాట్లాడారు. వాహనదారులకు ఎటువంటి ఆటంకం లేకుండా షాపులు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

హోటల్ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ

మందస: నిరుద్యోగులైన గిరిజన యువతీ, యువకులకు హోటల్ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ ఇవ్వనున్నట్టు సెర్ప్ ఏపీఎం గొడబ ప్రసాదరావు చెప్పారు. మందసలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఐటీడీఏ ఆధ్వర్యంలో ఈ నెల ఐదో తేదీ నుంచి హోటల్ మేనేజ్‌మెంట్ (ఫుడ్, బెవరేజ్)లో 45 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. మందస మండలం కుంటికోట సమీపంలోని గిరిజన శిక్షణ కేంద్రం (వైటీసీ)లో శిక్షణ ఇస్తామన్నారు. అభ్యర్థులు పదో తరగతి పాసై ఉండాలని, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, నాలుగు పాస్‌ఫొటోలు, కులధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

- శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియా
- కార్యాలయాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన వైనం
- మరమ్మతులు చేపట్టాలని సిబ్బందికి ఆదేశం


మున్సిపల్ కార్యాలయం వెనుక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ అన్సారియా

శ్రీకాకుళం: ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఊరు పరిశుభ్రంగా ఉంటుందని శ్రీకాకుళం నగర పాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియా అన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని ప్రతి విభాగాన్ని శుక్రవారం ఉదయం క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యాలయ ఆవరణను సైతం తనిఖీ చేశారు. మున్సిపల్ కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న కమిషనర్, హెల్త్ ఆఫీసర్, ఇతర అధికారుల క్వార్టర్లు ఖాళీగా ఉండటానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. కార్యాలయ ఆవరణ అపరిశుభ్రంగా ఉండడం, విద్యుత్ తీగలు వేలాడుతుండటాన్ని గమనించి అసహనం వ్యక్తం చేశారు. తక్షణం మరమ్మతులు చేయించాలని, వరండాల్లో ఉన్న పాత ఫైళ్లను ఏదైనా గదిలోకి మార్చాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ తీగలు వేలాడకుండా చూడాలన్నారు. కార్యాలయ ఆవరణలో ఉన్న మరుగుదొడ్లు పనిచేయకపోతే ఉద్యోగులు, సందర్శకులు ఇబ్బందులు పడరాఅని ప్రశ్నించారు. కౌన్సిల్ హాల్ కూడా అధ్వాన్నంగా ఉందన్నారు. కార్యాలయ వెనుక తుప్పు పట్టి ఉన్న వాహనాల విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇంజినీర్ సుగుణాకరరావుతో మాట్లాడుతూ.. యుద్ధ ప్రాతిపదికన విద్యుత్‌వైర్లు వేలాడకుండా చూడాలని, కార్యాలయ ఆవరణ వెనుక ఉన్న తుప్పు పట్టిన వాహనాలను అక్కడ నుంచి తరలించాలని, మరుగుదొడ్ల పనితీరు మెరుగయ్యేలా చూడాలని, కౌన్సిల్ హాల్‌కు మరమ్మతులు చేయాలని ఆదేశించారు. తర్వాత అధికారుల క్వార్టర్స్ కార్యాలయం చుట్టూ ఉన్న ఖాళీ స్థలాల విషయం ఆలోచించవచ్చన్నారు. కార్యాలయం ముందు భాగం కూడా బాగా పాడైందని, దశల వారీగా దానిని కూడా సుందరంగా తీర్చి దిద్దుతామన్నారు. కమిషనర్‌ను రెడ్‌క్రాస్ సభ్యులు పి.జగన్మోహనరావు, బలివాడ మల్లేశ్వరరావు, లైసెన్స్‌డు ఇంజినీర్ల సంఘ సభ్యులు హారికా ప్రసాద్‌తో పాటు పలువురు అభినందించారు. మున్సిపల్ ఉద్యోగులు కూడా తమను తాము పరిచయం చేసుకుంటూ పుష్పగుచ్ఛాలు అందించగా పాలన సజావుగా జరిగేలా సహకరించాలని కమిషనర్ కోరారు.

తలనీలాల వేలం ఖరారు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో తలనీలాల వేలం పాట ఎట్టకేలకు ఖరారయ్యింది. శుక్రవారం మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఈ వేలం పాటలో రాజమహేంద్రవరానికి చెందిన పిల్లా వాసుబాబు 63 లక్షల 45 వేల రూపాయలకు హెచ్చుపాటదారునిగా ఖరారు చేశారు. శ్రీకూర్మం ఈవో గురునాథరావు పర్యవేక్షణలో అరసవల్లి ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో ఐదుగురు పాటదారులు పాల్గొనగా హెచ్చుపాటదారునిగా వాసుబాబుకు ఖరారయ్యింది. ఈ హక్కు ఈ ఏడాది ఫిబ్రవరి మూడు నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి రెండో తేదీ వరకు అమల్లో ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ ఏడాది జనవరి రెండు నుంచి ఈ నెల రెండో తేదీ వరకు నిల్వ ఉన్న తలనీలాలను మొత్తం 44 కేజీలుగా గుర్తించి వేలం వేయగా.. కిలో రూ.4,100 చొప్పున 1,80,400 రూపాయలకు వాసుబాబుకే పాటను ఖరారు చేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన వీసీ


గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీసీ రజని


హేమచంద్రారెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న వీసీ

ఎచ్చెర్ల క్యాంపస్: అమరావతితో గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ఉన్నత విద్యా మండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డిని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ కె.ఆర్ రజని శుక్రవారం కలిశారు. సెప్టెంబర్‌లో నిర్వహించనున్న స్నాతకోత్సవానికి హాజరుకావాలని గవర్నర్‌ను ఆహ్వానించారు. అకడమిక్‌గా విద్య బలోపేతంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. ప్రభుత్వం మంజూరు చేసిన మూలధనం నిధులు రూ.ఐదు కోట్లు విడుదలకు కృషి చేయాలని కోరారు. వర్సిటీలో నిర్వహిస్తున్న కోర్సులు, ప్రస్తుత పరిస్థితిని వివరించారు. వర్సిటీలో సెప్టెంబర్‌లో స్నాతకోత్సవం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

ఆస్పత్రులకు వెళ్లి.. పింఛన్లు అందజేసి..


ఇచ్ఛాపురం రూరల్: వల్లభరావుకు పింఛన్ అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ రాజు


కంచిలి: మాధవరావు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ బెండి కుమారి

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం గ్రామానికి చెందిన 80 ఏళ్ల వృద్ధుడు దూపాన వల్లభరావు శ్రీకాకుళం రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈయనకు ఈ నెలకు సంబంధించి వృద్ధాప్య పింఛన్ మంజూరైంది. దీంతో వెల్ఫేర్ అసిస్టెంట్ కూన రాజు, వలంటీర్ తెలుకల పుష్పలతలు శుక్రవారం 150 కిలో మీటర్ల దూరంలో ఉన్న జెమ్స్ ఆస్పత్రికి వెళ్లి వల్లభరావుకు పింఛన్ అందజేసి ఆదర్శంగా నిలిచారు.

కంచిలి: డోలగోవిందపురం సచివాలయం పరిధి రేఖాదేవిపురం గ్రామానికి చెందిన దుర్గాసి మాధవరావు పక్షవాతంతో శ్రీకాకుళంలోని ఓ ప్రవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో ఈయనకు మంజూరైన పింఛన్ డబ్బులను వలంటీర్ బెండి కుమార్ శుక్రవారం ఆస్పత్రికి వెళ్లి అందించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఇచ్ఛాపురం రూరల్: మండపల్లి ఇందిరమ్మ కాలనీలో ఉపాధిహామీ పథకం నిధులు రూ.5 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు సర్పంచ్ పిట్ట శశిరేఖ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పంచాయతీల అభివృద్ధికి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పిట్ట మామయ్యరెడ్డి, పాతిర్ల వెంకటేష్, పాతిర్ల భీమారావు, ఆశి పారయ్య, ధర్మాన వెంకటరావు, తిప్పన కురయ్య, చిరంజీవి బెహరా, విష్ణు బెహరా, దుర్గాశి ధనయ్య, పాతిన జోగారావు, పాతిర్ల జోగారావు ఉన్నారు.

జి.బెల్లుపడ పంచాయతీలో..

కంచిలి: కేసరపడ సచివాలయం పరిధి జె.బెల్లుపడ పంచాయతీ కేంద్రంలో ఉపాధి హామీ పథకం నిధులు రూ. 4.5 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అయిదం జయరాం, స్థానిక నేతలు మెండ ప్రకాశ్, ఇప్పిలి నీలయ్య పాల్గొన్నారు.

టెక్కలి చేరిన పాదయాత్ర


పాదయాత్ర చేస్తున్న వెంకటరామారావు

టెక్కలి: రాజకీయంగా, సామాజికంగా ఎంతో వెనుకబడి ఉన్న తెలగ కులస్తులను బీసీల్లో చేర్చాలని కోరుతూ ఆ సంఘం నాయకుడు పల్లంట్ల వెంకటరామారావు ఇచ్ఛాపురం నుంచి చేపట్టిన పాదయాత్ర శుక్రవారం టెక్కలి చేరుకుంది. ఈ మేరకు టెక్కలి మండలంలోని తెలగ సంక్షేమ సంఘం ప్రతినిధులంతా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వెంకటరామారావు మాట్లాడుతూ.. అన్ని రకాలుగా వెనుకబడి ఉన్న తెలగ కులస్తులను బీసీల జాబితాల్లో చేర్చి ఆదుకోవాలని కోరారు. గతంలో పుట్టుస్వామి, మంజునాథ్ కమిషన్ ప్రభుత్వానికి నివేదిక అందజేశారని గుర్తు చేశారు. తెలగజాతి ఆత్మగౌరవ యాత్ర పేరుతో ఇచ్ఛాపురం నుంచి పాయకరావుపేట వరకు పాదయాత్ర చేపడుతున్నట్టు చెప్పారు. స్థానిక సంఘం ప్రతినిధులు దోని కొండలరావు, ఇల్ల కోదండ, బి.పెంటయ్య, జి.దాసు, పువ్వల ఢిల్లేశ్వరరావు, ఐ.సోమేశ్వరరావు ఉన్నారు.

పాఠశాల ముఖద్వారానికి విరాళం

కంచిలి: మండలంలోని డి.జి.పురం జెడ్పీ ఉన్నత పాఠశాలకు నూతనంగా నిర్మిస్తున్న ముఖద్వారానికి ముండ్ల జెడ్పీ హెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ పాఢి రూ. 15 వేలు విరాళాన్ని ఇచ్చారు. ఈ మొత్తాన్ని డి.జి.పురం పాఠశాల హెచ్ఎం ఉప్పాడ రమేష్‌కు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

సంతోషిమాతకు జన్మనక్షత్ర పూజలు


పూజలందుకుంటున్న సంతోషిమాత

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలోని సంతోషి మాత అమ్మవారి ఆలయంలో శుక్రవారం జన్మనక్షత్రం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు మోదుకూరి కిరణ్ శర్మ మూలవిరాట్టుకు పాలతో, పసుపు నీళ్లతో అభిషేకాలు నిర్వహించి, అమ్మవారికి అష్టోత్తర శతనామాలతో పూజలు చేశారు. ఉద్యాపనులు, మహానివేదన, మహా హారతి నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అమ్మవారిని పూలతో అలంకరించారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి


అవగాహన కల్పిస్తున్న కృష్ణవాసుదేవరావు

జి.సిగడాం: ఇంటర్మీడియెట్ పరీక్షల్లో కేజీబీవీ విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించాలని పొందూరు మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గురుబిల్లి కృష్ణవాసుదేవరావు అన్నారు. కేజీబీవీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులకు ఉన్నత విద్యపై శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న ప్రతీ విద్యార్థి ఉపాధి కల్పనతోపాటు ఉద్యోగ అవకాశాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. పొందూరు మోడల్ డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వసతి గృహం సౌకర్యం కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఎస్ఓ ఉషా రత్నకుమారి, అధ్యాపకులు డి.రవి, కె.సూర్యరావు, ఎ.శ్రీదేవి, ఎం.మాధురి, సింహాద్రి రమాదేవి, ఎం.రమేష్‌కుమార్, ఎస్.గణపతిరావు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

శ్రీకాకుళం రూరల్: పెదపాడులోని బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్, ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ జ్యోతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతిలో ఎస్సీ-70, ఎస్టీ-5, ఇంటర్ బైపీసీలో-40, ఎంపీసీలో-40 సీట్లు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 23వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు పెదపాడులోకి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో సంప్రదించాలన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా కామేశ్వరి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా తేజోమూర్తుల కామేశ్వరి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర కార్యదర్శిగా నియమించినందుకు సీఎం జగన్‌మోహన్ రెడ్డికి, జిల్లాకు చెందిన మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కామేశ్వరి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా 'ఆపస్' ఆవిర్భావ దినోత్సవం

ఇచ్ఛాపురం రూరల్: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఇన్నేసుపేట ప్రాథమికోన్నత పాఠశాలలో ఆపస్ జెండాను ఎగురవేసి వందనం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కీలు సోమేశ్వరరావు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యలు, హక్కులపై అలుపెరుగని పోరాటం చేసిన సంఘంగా ఆపస్ విశిష్ట సేవలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘ మండల అధ్యక్షులు బి.శంకరం, ప్రధాన కార్యదర్శి తారకేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సచివాలయాలతో గ్రామస్వరాజ్యం

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్


గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని గ్రామ సచివాలయాలతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. పిషిణి గ్రామంలో ఎన్ఆర్‌జీఎస్ నిధులు రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాపాలనకు గ్రామ సచివాలయాలు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయన్నారు. గతంలో మండల కేంద్రాల చుట్టూ తిరగాల్సిన ఉండేదని, ప్రస్తుతం గ్రామ స్థాయిలోనే అన్ని పనులు జరుగుతున్నాయన్నారు. గ్రామ వలంటీర్, గ్రామ సచివాలయ వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. పాలనంతా ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. సంక్షేమ పథకాలు పారదర్శకంగా ప్రజలకు చేరువ అవుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ లంకలపల్లి ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు మహంతి పెదరామినాయుడు, వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, పిల్లా ఆనందరావు పాత్రుడు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రెడ్డి విశ్వేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలు గురాన మానస, ఎంపీటీసీ పతివాడ నాగమణి, నెలివాడ సర్పంచ్ పతివాడ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్టార్ మహిళా వాకర్స్‌క్లబ్ అధ్యక్షురాలిగా లక్ష్మి


గేదెల లక్ష్మి

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం జిల్లాలో సామాజిక సేవల్లో అగ్రగామి క్లబ్‌గా పేరుగాంచిన స్టార్ వాకర్స్ క్లబ్ అనుబంధ సంస్థ స్టార్ మహిళా క్లబ్ అధ్యక్షురాలిగా గేదెల లక్ష్మి ఎన్నికయ్యారు. ఈ మేరకు శుక్రవారం నియామకం జరిపారు. జిల్లా కేంద్రాన్ని పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దే బాధ్యత స్టార్ వాకర్స్ క్లబ్ చేపట్టిందని అధ్యక్షుడు బి.వి.రవిశంకర్ అన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ చరిత్రలో తొలిసారిగా అత్యధిక శాతం సామాజిక సేవలు అందించే సామర్థ్యం స్టార్ వాకర్స్ క్లబ్‌కు దక్కడం విశేషం అని పలువురు నడక సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వాకర్స్, ఎన్‌సీసీ విద్యార్థులు కలిసి స్వచ్ఛ భారత్ చేపట్టారు. లక్ష్మి మాట్లాడుతూ.. తనకు అప్పగించిన ఈ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు గేదెల ఇందిరా ప్రసాద్, పి.జి.గుప్తా, ఎస్.జోగినాయుడు, బి.దేవీప్రసాద్, గోలీ సంతోష్, ఉమామహేశ్వరరావు, నాగేశ్వర ఈశ్వరరావు, మల్లిబాబు ఉన్నారు.

కానిస్టేబుల్‌పై ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైమ్: నగరంలోని ఓ హోటల్ వ్యాపారి రూరల్ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్‌పై ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశాడు. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని సూర్యమహల్ కూడలి సమీపాన ఎస్ఎమ్ ఫుడ్ స్క్వేర్ దుకాణానికి రూరల్ పీఎస్‌కు చెందిన కానిస్టేబుల్ గోపీ నలుగురు మిత్రులతో కలిసి గురువారం రాత్రి వెళ్లాడు. దుకాణంలో ఉన్న రోణంకి యుగంధర్‌ని పిలిచి మూడు బిర్యానీ ప్యాకెట్లు పార్సిల్ ఆర్డర్ చేశాడు. అయితే డబ్బులు అడిగేసరికి తాను పోలీసునని, డబ్బులు ఇవ్వనని కానిస్టేబుల్ అనడంతోపాటు తాను జనసేన పార్టీ అభిమానినని, తనను చూస్తే ఎవరైనా భయపడాల్సిందేనని యుగంధర్‌ను బెదిరించాడు. దీంతో యుగంధర్ 100కు ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించగా ఫోన్ లాక్కోవడంతోపాటు భౌతిక దాడికి దిగినట్టు యుగంధర్ ఫిర్యాదు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఈ ఉదంతం జిల్లా పోలీసు ఉన్నతాధికారిణి దృష్టికి వెళ్లడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేస్తూ విచారణ చేపట్టాలని ఒకటో పట్టణ పోలీసులను ఆదేశించినట్లు తెలిసింది. ఈ విషయాన్ని ఒకటో పట్టణ ఎస్ఐ బలివాడ గణేష్ వద్ద ప్రస్తావించగా.. ఫిర్యాదు రావడం వాస్తవమేనని చెప్పారు. విచారణ చేస్తున్నామన్నారు.

బదిలీపై వెళ్లిన ఎస్ఐకు సత్కారం


ఎస్ఐ రామారావును సత్కరిస్తున్న సీఐ, తదితరులు

జి.సిగడాం: విధి నిర్వహణలో ఉద్యోగులు అంకిత భావంతో పని చేస్తే ప్రజల నుంచి మంచి గుర్తింపు వస్తుందని రణస్థలం సీఐ రామచంద్రరరావు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన సామంతుల రామారావును శుక్రవారం సన్మానించారు. సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలకు ఉత్తమ సేవలను అందించడంలో ఎస్ఐ రామారావు ఎంతో కృషి చేశారన్నారు. డీసీఎంఎస్ డైరెక్టర్ నక్క ప్రసాదరావు, నాయకులు బొడ్డేపల్లి ఉదయ్‌కుమార్, పేడాడ జనార్దనరావు, పోలీసులు పాల్గొన్నారు.

తహసీల్దార్ల పోస్టింగుల్లో మార్పులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల నేపథ్యంలో ఇతర జిల్లాల నుంచి జిల్లాకు చ్చిన తహసీల్దార్లకు పాత కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పోస్టింగ్‌లు ఇచ్చారు. అయితే తాజాగా ఈ పోస్టింగ్‌లలో 9 స్థానాలను కొత్త కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ మార్పులు చేశారు.

తహసీల్దార్	మారిన స్థానం
డి.వీరభద్రరావు (విశాఖపట్నం)	స్పెషల్ తహసీల్దార్, శ్రీకాకుళం
ఎం.శ్రీను (విజయనగరం)	తహసీల్దార్, గార
జె.రమేష్ బాబు (విశాఖపట్నం)	సరుబుజ్జిలి, తహసీల్దార్
పి.కనకారావు (విశాఖపట్నం)	తహసీల్దార్, నరసన్నపేట
వి.శ్యాంకుమార్ (విశాఖపట్నం)	తహసీల్దార్, ఎచ్చెర్ల
ఎల్.రామారావు (విశాఖపట్నం)	తహసీల్దార్, రణస్థలం
పి.లచ్చ పాత్రుడు (విశాఖపట్నం)	తహసీల్దార్, కోటబొమ్మాళి.
ఎం.సురేష్ (విశాఖపట్నం)	తహసీల్దార్, వజ్రపుకొత్తూరు
ఎం.సురేష్ (విజయనగరం)	తహసీల్దార్, కంచిలి

పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శిగా వినోద్


వినోద్‌కుమార్

కాశీబుగ్గ: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మద్దిల వినోద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల నెల్లూరులో శెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జరిగిన రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వినోద్ స్వగ్రామం పలాస మండలం చిన్న గురుదాసుపురం. ఈయన్ని పలు విద్యార్థి సంఘాల నాయకులు అభినందించారు.

చిన్నారులకు ఆర్థిక సాయం


సాయం అందజేస్తున్న సభ్యులు

ఇచ్ఛాపురం రూరల్: తేలుకుంచి గ్రామానికి చెందిన మల్లవరపు వెంకటలక్ష్మిని వివాహితను ఆమె భర్త విడిచిపెట్టగా, సంక్రాంతి రోజు ఈమె మనస్తాపంతో ఆత్మహత్య చేసుకుంది. ఈమెకు 2,4 తరగతులు చదువుతున్న చిన్నారులు శరణ్య, లిఖితలు అనాథలుగా మిగిలిపోయారు. ఇటీవల 'సాక్షి' దినపత్రికలో 'అమ్మ లేదు..నాన్న రాడు' శీర్షికతో కథనం ప్రచురించడంతో పలువురు దాతలు ముందుకు వచ్చి తమకు తోచిన ఆర్థిక సాయాన్ని అందిస్తున్నారు. ఇచ్ఛాపురం గ్రామానికి చెందిన 'బెల్లుపడ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్' సభ్యులు శుక్రవారం చిన్నారులకు రూ.10 వేలు నగదుతో పాటు నిత్యవసర సరుకులు, నూతన దుస్తులు అందజేశారు.